క్లుప్తంగా

వైభవంగా కట్లమ్మ, నూకాలమ్మ జాతర

గణపవరం: మండలంలోని అర్ధవరం పరిసర గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవాలుగా కొలిచే గ్రామ దేవతలు కట్లమ్మ, నూకాలమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాలకు రంగులువేసి, రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. జాతర సందర్భంగా గురువార సాయంత్రం అమ్మవార్లకు గరగలసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గవళ్లగుడుపు సేవ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఐదురోజుల పాటు సోమవారం వరకూ కొనసాగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

దెందులూరు : పోతునూరు పీహెచ్‌సీని గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఆశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, తాగునీరు, శానిటేషన్, వైద్యశాల, రికార్డులు, పరికరాలు పరిశీలించారు. ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా దెందులూరు సీహెచ్‌సీని రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన సంగతి తెలిసిందే. దెందులూరు మండలంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సాయంత్రం నుంచి ఉదయం 10 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండకపోవడంపై జిల్లా, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి ఈ తనిఖీలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

వ్యక్తిపై దాడి

దెందులూరు : ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో మాజీ ఎంపీటీసీ సుధాకర్‌కు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. దోసపాడు గ్రామంలో మాజీ ఎంపీటీసీ సుధాకర్ తన ఇంటి వద్ద కూలీతో తాపీ పని చేయించుకుంటున్నాడు. ఆ కూలీతో మనోజ్ అనే వ్యక్తి వచ్చి గొడవ పడుతుండడంతో సుధాకర్ వారిని వారించే ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో మనోజ్ బ్లేడ్‌తో దాడి చేయడంతో సుధాకర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు విలేకరులకు తెలిపాడు.

యువతి అదృశ్యంపై కేసు

నిడమర్రు: నిడమర్రు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ జి.వినాయక్ తెలిపారు. బువ్వనపల్లి గ్రామానికి చెందిన యువతి ఈ నెల 13 నుంచి కనిపించడం లేదని, గురువారం వరకూ ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎంఈవో కార్యాలయం ఆకస్మిక తనిఖీ

ఏలూరు రూరల్: ఏలూరు మండల విద్యాశాఖ కార్యాలయాలన్ని గురువారం డీఈఓ ఎస్వీ రవిసాగర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈఓ సచ్చిత నరసింహమూర్తి సమక్షంలో ఎకడమిక్, నాన్ ఎకడమిక్ రికార్డులతో పాటు బైజ్యూస్ ట్యాబ్ రికార్డులు పరిశీలించారు. రివాల్వింగ్ ఫండ్ ఖర్చుకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా చేపట్టిన నాడు-నేడు, జగనన్న గోరు ముద్దతో పాటు పిల్లలకు యూనిఫాం, బూట్లు, పుస్తకాలు పంపిణీ కార్యక్రమాలు పక్కాగా అమలు చేయడమే విద్యాశాఖ లక్ష్యం అన్నారు. అర్హత కల్గిన ప్రతి ఒక్క విద్యార్థికి ప్రభుత్వం చేపట్టిన పథకాలు అందాలన్నారు. పాఠశాల స్థాయిలో విద్యాశాఖ పథకాలు అమలు చేయాల్సిన బాధ్యత మండలధికారిదే అన్నారు. రికార్డులు మెయింటెన్స్, పథకాలు అమలు బాగుందని ఎంఈఓతో పాటు సిబ్బందిని అభినందించారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు – కైకలూరు రహదారిలో శ్రీపర్రు కాజ్‌వే వద్ద ఆటో బోల్తా కొట్టిన సంఘటనలో డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు మాదేపల్లి ఇందిరా కాలనీకి చెందిన కాల్వ ఆంజనేయులు (45) ఆటో నడపటం, పాత ఐరన్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ఆంజనేయులు గురువారం ఆటో వేసుకుని శ్రీపర్రు వైపు వెళుతూ కాజ్‌వే దాటుతుండగా గుంతలో పడి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు కిందపడి పోగా అతనిపై ఆటో పడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు బోధనాసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టణంలోని పేరంపేట పెదరామాలయం వద్ద నివాసం ఉంటున్న జోగి వీరబాబుకు, దాక్షాయనికి 9 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. ఇటీవల భర్త అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని, ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ రాత్రి భర్త వీరబాబు చాకుతో గాయపర్చగా, అత్త సింహాచలం అతనికి సహకరించిందని బాధితురాలు దాక్షాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి


పెదవేగి తూముల సెంటర్‌లో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ తాతా రమ్య, ఇతర అధికారులు, నాయకులు


కొవ్వలి ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం జీఎస్‌ఎన్‌ఎల్‌వీ శర్మ

పెదవేగి : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేసిన ధన్యజీవి అని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు 123వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ ఏఓ కేవీ జాన్సన్, సీనియర్ అసిస్టెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కె వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తూముల సెంటర్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంపీపీ తాతా రమ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్, సచివాలయ సిబ్బంది, పెదవేగి వాసవి క్లబ్ సభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దెందులూరు : తెలుగు రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీఎస్‌ఎన్‌ఎల్‌వీ శర్మ అన్నారు. గురువారం పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఉపాధ్యాయులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగం, ప్రణాళిక నేడు మనం అనుభవిస్తున్న


ఆక్సిజన్ మెషీన్‌ను అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

తెలుగు రాష్ట్రమేనన్నారు. అటువంటి మహనీయుడిని నిరంతరం స్మరించుకోవాలన్నారు. దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని భీమడోలు గ్రంథాలయ అభివృ


భీమడోలు లైబ్రరీలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ద్ధి కమిటి అధ్యక్షుడు, లయన్స్ డైమండ్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు 123వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవరణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలుగువారికి ఆంధ్ర రాష్ట్రాన్ని తీసుకుని వచ్చిన మహాయోధుడన్నారు. రీడర్స్‌ఫోరమ్ కమిటి సభ్యుడు పీవీ రాఘవులు మాట్లాడుతూ తాను మూడో తరగతి చదువుకుంటున్నానని, నిరాహారదీక్ష రోజుల్లో తామంతా దీక్షకు మద్దతుగా ఉద్యమాలు చేశామన్నారు.

ఉంగుటూరులో...

ఉంగుటూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని కై కరంలో ఘనంగా నిర్వహించారు. గురువారం కైకరం సెంటర్లో పొట్టి శ్రీరాములు విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు ఈ సేవ వద్ద నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో గ్రామ పంచాయతీకి 60 వేలరూపాయలు విలువైన ఆక్సిజన్ మెషీన్ (కాన్సంట్రేషన్)ఆర్యవైశ్య సంఘం నాయకులు కోనా శ్రీనివాసరావు, హనుమాన్ బాబులు అందించారు. జాతిహితం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణాలు అర్పించాచని ఎస్ఎఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం నారాయణపురం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పొట్టి శ్రీరాములు 122 వజయంతి జరిపారు. బొమ్మిడి అప్పారావు, కొండారవి, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డయ్య పాల్గొన్నారు.

నేడు దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు : సానిగూడెం గ్రామంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నూతనంగా నిర్మించిన శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు) తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాసరావు తెలిపారు.

దళిత సంఘాల హర్షం

దెందులూరు : రాష్ట్ర ఎస్సీ కమిషన్ పదవి కాలాన్ని మరో రెండేళ్లపాటు పొడిగించడంపై దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. గురువారం గంగన్నగూడెంలో స్థానిక కమ్యూనిటీ హాలులో దళిత సంఘాల నేతలు మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ నాయకత్వంలో బాధిత దళితులకు సత్వర న్యాయం జరగడానికి మరో రెండేళ్ల పదవీ కాలం పొడిగించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సంఘాల జాతీయ కన్వీనర్ పొలిమేర హరికృష్ణ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ఎం.అజయ్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్, మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనికెళ్ళ మురళీకృష్ణ, ఎంఆర్‌పీఎస్ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళి హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

పెదపాడు : వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను గణాంక అధికారి కె శ్రీనివాసరావు పరిశీలించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆశ ఆదేశాల మేరకు వట్లూరు పీహెచ్‌సీలో రికార్డులతో పాటు అప్పనవీడు ఏపూరు ఆరోగ్య ఉప కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను సందర్శించి సంబంధించిన రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపగణాంక అధికారి జి.గిరి గణేష్,, మెడికల్ ఆఫీసర్ బి.రవితేజ, ఎంపీహెచ్‌ఈఓలు పాల్గొన్నారు.

దొండ పందిళ్లకు సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్

పెదవేగి : దొండ పందిళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని, కూరగాయల సాగు రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదవేగి మండలంలోని సీతాపురం, కూచింపూడి, రామసింగవరం తదితర గ్రామాలలో రైతు సంఘం నాయకులు పర్యటించి దొండ పందిళ్ల సాగును పరిశీలించారు. కూరగాయలు సాగులో వస్తున్న సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరా దొండ పందిరి సాగుకు పందిరితో కలుపుకుని రూ.4 లక్షల వరకు పెట్టుబడి అవుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దొండ పందిళ్లకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గత బకాయిలను చెల్లించి, దొండ పందిళ్ళ సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని కోరారు.


రామశింగవరంలో దొండ పాదును పరిశీలిస్తున్న రైతు సంఘం నేత శ్రీనివాస్

తామర పురుగు, ఎర్రనల్లి వంటి తెగుళ్ల వ్యాపించి కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లి దిగుబడులు రావడం లేదన్నారు. తెగుళ్ల నివారణకు అవసరమైన పురుగుమందులను సబ్సిడీ ధరలకు రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఏడుకొండలు, పలువురు కూరగాయల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం

పెదవేగి : రాట్నాలకుంటలో శ్రీ కొఠారు అబ్బయ్య మెమోరియల్ శ్రీ షిరిడీ సాయి చారిటబుల్ ట్రస్ట్ సాయి మందిర 19వ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబా వారిని అర్చకులు చావళి సత్యనారాయణ మూర్తి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న దేవతా మూర్తులకు అభిషేకాలు జరిపారు. అనంతరం ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాణి దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు బాబా వారి ఊరేగింపు ప్రారంభించారు. రాట్నాలకుంట, కొండలరావుపాలెం, రాయన్నపాలెం పాతూరు, రాయన్నపాలెం కొత్తూరు గ్రామాల్లో సాయినాథుని ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు పాతూరు రాయన్నపాలెం శ్రీ లక్ష్మీదుర్గా భజన సమాజం వారిచే సాయినామ సంకీర్తన,


సాయినాథుని ఊరేగింపులో పాల్గొన్న కొఠారు, తదితరులు

రాత్రి 10 నుంచి 1 గంట వరకు కొత్తూరు రాయన్నపాలెం శ్రీ రామాంజనేయ భజన సమాజం వారిచే సాయి నామకీర్తనలు నిర్వహించారు. ఊరేగింపులో భాగంగా కొఠారు దంపతులు రాట్నాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారిని సేవించారు.

టెన్త్ విద్యార్థులకు హాల్‌టికెట్ల పంపిణీ

నిడమర్రు: ఈ ఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గురువారం ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో హాల్‌టికెట్స్ పంపిణీ చేశారు. మండలంలో 7 జెడ్పీ స్కూల్స్‌తో పాటు 5 ప్రైవేటు స్కూల్స్ నుంచి ఈ ఏడాది 742 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవనున్నారు. ఈ విద్యార్థులకు మండలంలో నిడమర్రు, పెదనింద్రకొలను జెడ్పీస్కూల్స్‌లో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఆన్‌లైన్‌లో ఎలాంటి పాస్‌వర్డ్ లేకుండా విద్యార్థులు హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లు ఎంఈవో పుచ్చల శేషు తెలిపారు. ప్రైవేటు స్కూల్స్ వారు ఫీజులకు, హాల్‌టికెట్స్‌కు లింక్ పెట్టే అవకాశం లేకుండా అధికారులు ఆన్‌లైన్‌లో హాల్‌టి


పత్తేపురం జెడ్పీస్కూల్లో టెన్త్ విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ

కెట్స్ డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. పత్తేపురంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, పూర్వపు హెచ్‌ఎం పోతురాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులున్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు

గణపవరం: విద్యార్థుల్లో రక్తహీనత కారణంగా ఆరోగ్యసమస్యలు తలెత్తి చదువులో బాగా వెనుకబడతారని అందువల్ల ప్రతి ఒక్కరూ రక్త హీనత సమస్య నుంచి బయటపడాలని గణపవరం బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రాంబాబు అన్నారు. గురువారం గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధిలోని 7 హైస్కూల్స్, 60 ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానమంత్రి బాలస్వస్థ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేశారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వాడటంతో పాటు ఆకు కూరలను ఎక్కువగా తీసుకొంటే రక్తహీనత సమస్య ఉండదన్నారు. అంగన్‌వాడీ కేంద్రా


గణపవరం బాలుర హైస్కూల్‌లో ఐరన్‌మాత్రలు వేస్తున్న హెచ్‌ఎం రాంబాబు

లలో పిల్లలకు కూడా ఐరన్ మాత్రలు వేశారు. సీహెచ్‌వో జాలాదివిల్సన్, ఆరోగ్యసహాయకులు యోహాన్, నామాలరాజు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

బుట్టాయగూడెం : మండలంలోని అల్లికాలువ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్రవాహనంపై వెళుతున్న కురసం చంద్రశేఖర్ అనే వ్యక్తి వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


గణపవరం పరీక్షాకేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

గణపవరం: గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజిలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు తెలుగు, హిందీ, సంస్కృతం, ఒకేషనల్ కోర్సు, నర్సింగ్ పరీక్షలు నిర్వహించారు. తెలుగుపరీక్షకు 111 మందికి గాను 98 మంది, హిందీ పరీక్షకు 20మంది, సంస్కృతం పరీక్షకు 98 మందికి 97 మంది, నర్సింగ్ పరీక్షకు 29 మదికి గాను 28 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ ఎం.రఘు తెలిపారు. ఫ్లెయింగ్ స్వాడ్ అధికారులు పరీక్షాకేంద్రాన్ని సందర్శించి, పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుని కల్యాణం


కాశీవిశ్వేశ్వరుని కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు

గణపవరం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన కురసాల వెంకట పవన్, విజయలక్ష్మి దంపతులు కల్యాణం నిర్వహించారు. ఈ ఉత్సవాలు శుక్రవారం కూడా కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయంవద్ద అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.

గణపవరాన్ని భీమవరం డివిజన్‌లో ఉంచాలి

గణపవరం: గణపవరం మండలాన్ని భీమవరం రెవెన్యూ డివిజన్‌లో ఉంచాలని గణపవరం మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సంయుక్తంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు చనుమూరి లక్ష్మీ భవాని గణపవరం తహసీల్దార్ కృష్ణస్వామి, ఎంపిడివో జ్యోతిర్మయిలకు వినితిపత్రం సమర్పించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలో ఉంటున్న గణపవరం మండలాన్ని ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాలోకి విలీనం చేశారు. ఈ మేరకు గణపవరం మండలాన్ని భీమవరం రెవెన్యూ డివిజన్‌లో కలిపారు. అయితే కొత్తగా తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించడంతో గణపవరం మండలాన్ని తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లోకి కలపడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో గణపవరం మండలాన్ని ప్రజలకు అనుకూలంగా ఉండే భీమవరం రెవెన్యూ డివిజన్


గణపవరం తహసీల్దార్ కృష్ణస్వామికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు భవాని

లోనే ఉంచాలని కోరుతూ మండలంలోని 25 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ అభ్యంతరాన్ని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ధరల పట్టికను ప్రదర్శించాలి

భీమడోలు: డీలర్లు దుకాణాల్లో విక్రయించే ఎరువులు, పురుగుమందుల ధరల పట్టికలను విధిగా ప్రదర్శించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కేఆర్‌పురం సహాయ సంచాలకులు బుచ్చిబాబు అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల వ్యవసాయాధికారి ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి ఆయన మండలంలోని భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో పురుగు మందులు, ఎరువులు దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేసారు. దాళ్వాలో రైతులు కొనుగోలు చేస్తున్న ఎరువులు, పురుగుమందుల స్టాక్ ను వారు పరిశీలించారు. ఈ పోస్‌లోని స్టాక్ వివరాలుకు, క్షేత్ర స్థాయిలో ఉన్న స్టాక్‌లకు మధ్య వ్యత్యాసాలను గుర్తించారు. ఎరువులు, పురుగుమందులు నిల్వ ఉన్న గుడౌన్‌ను ఆయన పరిశీలించారు. లైసెన్సులు, బిల్ పుస్తకాలు,స్టాక్ రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి డీలర్లుకు సూచనలందించారు. ఈ పోస్ సక్రమం


భీమడోలులో పురుగుమందు, ఎరువుల గోడౌన్‌లోని స్టాక్‌ను పరిశీలిస్తున్న కేఆర్‌పురం ఏడీఏ బుచ్చిబాబు, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి తదితరులు

గా వినియోగించాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి విధిగా రశీదు పుస్తకాలను అందించాలని, రిజిష్టర్లను ఎప్పటికప్పుడు తాజా పర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

కొక్కిరపాడులో పొలంబడి

పెదపాడు : రైతులు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు చేసుకోవాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్ అన్నారు. కొక్కిరపాడు గ్రామంలో గురువారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ-క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. పంటనమోదు చేయడం ద్వారా ఏ పంట ఎంతమేర సాగు అవుతుందో స్పష్టంగా తెలుస్తుందని, రైతులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు


పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

ఏమి కల్పించాలో ప్రభుత్వానికి తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీ వీరంకి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎకోక్లబ్ సభ్యులు

గణపవరం: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై పాఠశాల స్థాయినుంచే అవగాహన కలిగి ఉండాలని గణపవరం డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం కాలేజి ఎకోక్లబ్, బోటనీ విభాగాల ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యం నుంచి ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం, పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడం వంటి కార్యక్రమాలలో భాగ స్వాములు కావాలని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ మధురాజు బోటనీ అధ్యాపకురాలు సీహెచ్ చైతన్య, అధ్యాపకులు స్వరూపరాణి, శ్రీనివాసరావు, ఎస్‌కే పర్వీన్, సీహెచ్ అనూరాధ పాల్గొన్నారు.

తహసీల్దార్ విచారణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఆర్ఎస్ నెంబర్ 449లో ఉన్న 5 సెంట్ల స్థలం వివాదానికి సంబంధించి గురువారం తహసీల్దార్ కె.స్లీవజోజి విచారణ నిర్వహించారు. ఇరువర్గాలనుంచి స్థలానికి సంబంధించి దస్త్రాలను స్వీకరించి, వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.